# సాక్షి
## తూర్పుగోదావరి

శనివారం । 19 । ఏప్రిల్ । 2025






### నరకం వయా బరకం!

రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులపై రైతులు రాత్రి వేళ నల్లబరకాలు కప్పి, వాటిపై రాళ్లు పెడుతున్నారు. వాటిని ఢీకొని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.




### నైవేద్య నారాయణులు

ప్రభుత్వాసుపత్రికి వైద్యానికి వెళ్తే.. అక్కడి వైద్యులు ప్రైవేటు ఆసుపత్రికి రిఫర్ చేస్తున్న విషయం.. శస్త్రచికిత్స చేసిన ఓ రోగి మృతితో బట్టబయలైంది.

10లో

### సాగుకు 4,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 900, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.10 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### కళ్లాల్లోనే ధాన్యం.. లెక్కల్లో పూర్తయిన లక్ష్యం



కొత్త తుంగపాడులో కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం

రాజానగరం: రబీలో పండిన ధాన్యమంతా తమ వద్దనే ఉంటే, కొనుగోలు లక్ష్యాలు ఎలా పూర్తయ్యాయని రాజానగరం మండలం కొత్త తుంగపాడు, పాత తుంగపాడు, జి.యర్రంపాలెం, సంపత్ నగరం, కొండగుంటూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ గ్రామాల్లో 2,750 ఎకరాల్లో వరి సాగు చేయగా, 8,950 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయి. వీటిని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వెళ్లిన రైతులకు 'కొనుగోలు లక్ష్యం పూర్తయింది, ఇక ఒక్క గింజ కూడా కొనలేం' అని అక్కడి సిబ్బంది చెప్పిన సమాధానం షాక్ ఇచ్చింది. దీంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని రైతులు ఉంగరాల ఆదినారాయణ, నాగేశ్వరరావు, కోనే సత్తిబాబు తెలిపారు. కొనుగోలుకు ఇంకా అవకాశం ఉందని, మరోసారి వెళ్లి అడగాలని కలెక్టర్ చెప్పడంతో తిరిగి వచ్చిన తమకు స్థానిక కొనుగోలు కేంద్రాల వద్ద తిరిగి పైసమాధానమే వచ్చిందన్నారు. తనకు వచ్చిన కూపన్ (మొబైల్ మెసేజ్) ఆధారంగా ధాన్యం అమ్మకాలకు వెళ్తే టార్గెట్ అయిపోయిందని, తీసుకోలేమంటున్నారని సత్తిబాబు వాపోయారు. తనకున్న రెండున్నరెకరాల్లో అప్పులు చేసి మరీ పంట పండించానని, ఇప్పుడు ధాన్యం కొనుగోలుకు కూడా వీలు లేకుంటే తనకు చావే శరణ్యమని మరో రైతు సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. ఐదారేళ్లుగా కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం అమ్ముతున్నామని, ఆఖరుకు తడిసి, మొలకలు వచ్చిన ధాన్యాన్ని కూడా గత ప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. ఇప్పుడు ఆరుదలతో ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని కోరితే టార్గెట్ పూర్తయ్యిందనడం విడ్డూరంగా ఉందన్నారు. బయటి మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర (75 కిలోల బస్తా రూ.1,725) వస్తుందనే ఆశతో చూస్తున్నామన్నారు. పాత తుంగపాడు, కొత్త తుంగపాడు, జి.యర్రంపాలెం, కొండగుంటూరు, సంపత్ నగరం గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యం రోడ్ల పైనే దర్శనమిస్తోంది.

### 12 లక్షల టన్నుల ఇసుక సిద్ధంగా ఉంచాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డీసిల్టేషన్, ఓపెన్ రీచ్‌లు, సెమీ మెకనైజ్డ్ పాయింట్ల ద్వారా 12 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను 45 రోజుల్లోగా గుర్తించిన స్టాక్ యార్డుల్లో అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఇసుక సరఫరా విధానంపై సంబంధిత ఏజెన్సీల ప్రతినిధులతో తన క్యాంపు కార్యాలయంలో ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టాక్ యార్డుల నిర్వహణకు ఎవరైనా ముందుకు వస్తే అనుమతి ఇస్తామని చెప్పారు. ఇసుక సరఫరా విధానంపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోందని, ఏదైనా ఏజెన్సీపై ఫిర్యాదులు వస్తే వారే జవాబుదారీగా ఉండాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. స్టాక్ పాయింట్ నిర్వహణ, అమ్మకాల విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఆర్డీఓలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవీ గిరి తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల రేషియోలో వివక్ష ఎందుకు?

రాజానగరం: ప్రభుత్వ ఏలుబడిలోని పాఠశాలలన్నింటిలో విద్యార్థులు, ఉపాధ్యాయుల రేషియో ఒకేవిధంగా ఉండాలని, కానీ ఉన్నత పాఠశాలలకు ఒకలా, ప్రాథమిక పాఠశాలలకు మరోలా అమలు చేస్తూ ఎందుకు వివక్ష చూపుతున్నారని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి త్రినాథ్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లోని ప్రాథమిక తరగతుల్లో 10 మంది విద్యార్థులుంటే 2, 11 మంది ఉంటే 3, 31 మంది ఉంటే 4 చొప్పున ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేస్తున్నారని అన్నారు. అదే ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులుంటే ఒక్క ఉపాధ్యాయుడినే కేటాయిస్తున్నారన్నారు. ఫౌండేషన్ స్కూల్స్‌లో 30 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడినే నియమిస్తున్నారని తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌లో 59 మందిలోపు విద్యార్థులున్నా నలుగురు ఉపాధ్యాయులుంటున్నారన్నారు. అన్నీ ప్రభుత్వ పాఠశాలలే అయినప్పటికీ ఫౌండేషన్ స్కూల్స్, మోడల్ ప్రైమరీ స్కూల్స్ విషయంలో ఎందుకు వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. దీనివలన విద్యా ప్రమాణాల్లో కూడా వ్యత్యాసం వస్తుందనే విషయాన్ని అధికారులు గ్రహించాలని త్రినాథ్‌బాబు విజ్ఞప్తి చేశారు.

# క్రీస్తు త్యాగం.. సమస్త మానవాళికీ స్ఫూర్తిదాయకం



సిలువ యాత్రలో పాల్గొన్న క్రైస్తవులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రేమ, కరుణ, క్షమ, సహనం, త్యాగం వంటి సద్గుణాలను ప్రబోధించిన దైవ కుమారుడైన ఏసు క్రీస్తు సిలువ మరణం పొందిన రోజును పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు నుంచి నగరంలోని గోదావరి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆశయం దేవాలయం వరకూ కాలి నడకన భారీ సిలువ యాత్ర నిర్వహించారు. పాపాల నుంచి భక్తులను విముక్తుల్ని చేయడానికి, వారి కష్టాలు తొలగించడానికి జీసస్ ఎదుర్కొన్న కష్టాలు, అవమానాలు, శిలువ మరణం, ఆయన పట్ల నాటి రాజుల క్రూరత్వాన్ని కళ్లకు కట్టేలా ఈ యాత్ర సాగింది. సిలువ మోస్తున్న క్రీస్తు వేషధారణ, రాజభటులు ముళ్ల కొరడాలతో ఆయనను హింసించడం వంటి సన్నివేశాలను ప్రదర్శించారు. క్రీస్తు ప్రభువు స్ఫూర్తితో త్యాగం, సహనం, ప్రేమ, కరుణ, క్షమ వంటి సద్గుణాలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా సందేశం ఇప్పించారు. తోటివారిని ఆదుకోవడంలో ఎంతో తృప్తి ఉంటుందని, సమస్త మానవాళిలో ఈర్ష్య, అసూయ, ద్వేషం తదితర అవగుణాలను రూపుమాపి, ప్రతి ఒక్కరినీ సన్మార్గంలో నడిపించేందుకే క్రీస్తు ఈ భూమి మీదకు వచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోదావరి విచారణ, దివ్యదర్శిని దేవాలయం, ఆశయ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సిలువ మోస్తున్న ఏసుక్రీస్తు వేషధారి

# ప్రైవేటుకే ఫిట్‌నెస్

- వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ బయటి సంస్థలకు అప్పగింత
- జిల్లాలో ప్రత్యేకంగా వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- వాహనాల పరీక్షపై అనుమానాలు



రాజానగరం మండలం కలవచర్ల సమీపాన ఉన్న వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ సెంటర్

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాంది పలికిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అత్యంత ప్రధానమైన, ప్రజలకు ఉపయోగకరమైన సేవలను ప్రైవేటుకు కట్టబెట్టే ప్రక్రియ జరుగుతోంది. రైల్వే శాఖలో పలు సేవలను ఇప్పటికే ప్రైవేటుకు అప్పగించారు. తాజాగా ఆ జాబితాలోకి రాష్ట్ర రవాణా శాఖ కూడా చేరింది. ఇందులో అత్యంత కీలకమైన వాహనాల ఫిట్‌నెస్ (సామర్థ్య) సర్టిఫికెట్ల జారీ సేవలను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఈ మేరకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బదిలీ విధానం వేగంగా సాగిపోయింది. ప్రతి జిల్లాకు ఒక ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ మంజూరైంది. ఇప్పటి వరకూ రవాణా శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే ఆయా వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చలానా కట్టించుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఇకపై లైట్, హెవీ మోటార్ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ప్రభుత్వం నిర్ణయించిన ప్రైవేటు సంస్థ మాత్రమే జారీ చేస్తుంది. ఈ సంస్థపై స్థానికంగా ఎవ్వరి అజమాయిషీ ఉండదు. కేంద్ర ప్రభుత్వమే నేరుగా పర్యవేక్షిస్తుంది.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల వాహనాలు 4,57,200 ఉన్నాయి. వీటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా ఒక్కో జిల్లా నుంచి రూ.కోట్లలో ఆదాయం సమకూరేది. దీనిని ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో ఆ మేరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. కేంద్ర ట్రాన్స్‌పోర్ట్ ఇండియా సలహా మేరకు వాహనాల ఫిట్‌నెస్ టెస్ట్ కోసం వసూలు చేసిన సొమ్మును ఫిట్‌నెస్ స్టేషన్లు రెండేళ్ల పాటు తమ సొంతానికి వినియోగించుకోవచ్చు. ప్రభుత్వానికి ఒక్క పైసా కూడా చెల్లించనక్కరలేదు. ఈ మేరకు టెండర్‌లో నిబంధన పెట్టారని చెబుతున్నారు.



ఫిట్‌నెస్ కోసం బారులు తీరిన వాహనాలు

**రాజానగరం వద్ద టెస్టింగ్ స్టేషన్**

జిల్లాకు సంబంధించి రాజానగరం మండలం కలవచర్ల సమీపాన సుమారు రూ.4.5 కోట్లతో వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్‌లో మెషీనరీతో పాటు 21 మంది సిబ్బంది ఉంటారు. వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు, సర్టిఫికెట్ల జారీ ఇక్కడే జరుగుతాయి. సిబ్బందిని సైతం సంబంధిత ప్రైవేటు ఏజెన్సీయే నియమించుకుంటుంది. ఇందులో రాష్ట్ర రవాణా శాఖ అధికారుల ప్రమేయం కానీ, అజమాయిషీ కానీ ఏమాత్రం ఉండదు.

**అదనంగా వసూళ్లు**

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందేందుకు తొలుత ఆన్‌లైన్‌లో సంస్థ నిర్దేశించిన మొత్తం చెల్లించి, స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం నిర్దేశించిన సమయంలోపు పరీక్ష చేయించుకోవాలి. లేదంటే చలానా సమయం ముగుస్తుంది. దీంతో, మళ్లీ చలానా తీయాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో చలానా గడువు వారం నుంచి 15 రోజుల వరకూ ఉండేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని వాపోతున్నారు. ప్రభుత్వం గతంలో వసూలు చేసిన చలానాకు అదనంగా రూ.200 పైగా వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ చలానా ధరల ప్రకారం లైట్ మోటారు వెహికల్ కేటగిరీకి అంటే ఆటో నుంచి మిగతా అన్నింటి ఫిట్‌నెస్ పరీక్షకు రూ.860 వసూలు చేయాలి. కానీ రూ.1,250 వసూలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే, హెవీ మోటార్ వెహికల్స్‌కు రూ.1,320 వసూలు చేయాల్సి ఉంది. ప్రతి రోజూ ఈ స్టేషన్‌లో 50 నుంచి 60 వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

**పారదర్శకత ప్రశ్నార్థకం**

వాహనాల ఫిట్‌నెస్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి. అప్పుడే ప్రమాదాల నుంచి గట్టెక్కే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడం, అన్నీ ప్రైవేటు వ్యక్తులే చేస్తూండటంతో పారదర్శకతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఎటువంటి లోటుపాట్లు లేకుండా టెస్టులు నిర్వహిస్తే మంచిదేనని, తమకు ఎవరూ నియంత్రించలేరంటూ ఎలా పడితే అలా చేస్తే ప్రమాదాలు తప్పవని పలువురు ఆందోళన చెందుతున్నారు.

### జిల్లావ్యాప్తంగా వాహనాల వివరాలు

జిల్లావ్యాప్తంగా వివిధ రకాల వాహనాలు 4,57,200 ఉన్నాయి. అత్యధికంగా ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. తరువాతి స్థానం కార్లది.

| వాహనం | సంఖ్య |
|---|---|
| ద్విచక్ర వాహనాలు | 3,41,117 |
| కార్లు | 45,404 |
| ఆటోలు | 21,726 |
| గూడ్స్ క్యారియర్లు | 20,465 |
| ట్రాక్టర్లు | 7,807 |
| ట్రాలీలు | 4,896 |
| త్రీ వీలర్ గూడ్స్ వాహనాలు | 3,599 |
| ట్రైలర్ (అగ్రికల్చర్) | 2,306 |
| స్కూల్, కాలేజీ బస్సులు | 1,827 |
| లగ్జరీ టూరిస్ట్ క్యాబ్‌లు | 342 |
| అంబులెన్సులు | 230 |
| జీపులు | 150 |
| రోడ్డు రోలర్లు | 67 |

**ఫిట్‌నెస్ టెస్ట్ ఇలా..**

రోడ్లపై తిరిగే ప్రైవేటు బస్సులు, కార్లు, క్యాబ్, ట్రాక్టర్లు, లారీలు, గూడ్స్ వాహనాలు, ట్యాంకర్లు, స్కూల్ బస్సుల వంటి ప్రతి వాహనానికీ ఫిట్‌నెస్ టెస్టులు తప్పనిసరి. పసుపు రంగు నంబర్ ప్లేట్ ఉంటే ట్రాన్స్‌పోర్టు, తెలుపు రంగు నంబర్ ప్లేట్ ఉంటే నాన్-ట్రాన్స్‌పోర్టు వాహనాలుగా పరిగణిస్తారు. కొత్త వాహనానికి లైఫ్‌టైంలో మొదటి ఎనిమిదేళ్లలో ప్రతి రెండేళ్లకోసారి ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాలి. ఎనిమిదేళ్ల తర్వాత ఏడాదికోసారి ఈ పరీక్ష తప్పనిసరి. 15 ఏళ్లకు కండిషన్ చూసి, ఆపేయాలి. స్కూల్ బస్సులకు 15 ఏళ్ల వరకే ఫిట్‌నెస్ చూస్తారు. తర్వాత వాటిని స్కూల్ బస్సుల కింద వాడకూడదు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీని ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వలన వాహనాల తనిఖీలు ఎంత వరకూ సక్రమంగా జరుగుతాయనే ప్రశ్న తలెత్తుతోంది. గతంలో రవాణా శాఖ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు ప్రహసనంగా జరిగేవి. కొందరు అధికారులు మామూళ్లు దండుకుని చూసీచూడనట్లు వ్యవహరించేవారు. దీంతో, ప్రమాదాలు చోటు చేసుకునేవి. ప్రధానంగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌లో ఇలాంటి ఘటనలు తరచుగా జరిగేవి. ఇప్పుడు కూడా అటువంటి పరిస్థితులే ఎదురైతే ఎలాగనే ప్రశ్న వాహనదారులు, ప్రజల్లో ఉత్పన్నమవుతోంది. ప్రైవేటు ఏజెన్సీపై పర్యవేక్షణకు జిల్లాలో ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి



మహమ్మద్ ఆరిఫ్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): పార్లమెంటు ఉభయ సభల్లోనూ వక్ఫ్ చట్ట సవరణకు అనుకూలంగా ఓటు వేసి ముస్లింలను కోలుకోలేని విధంగా కూటమి ప్రజాప్రతినిధులు దెబ్బ కొట్టారని వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యను ముస్లింలు, లౌకికవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళ్లే ధైర్యం కూటమి ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా పార్లమెంటు ఉభయ సభల్లో ఓటు వేయడం ద్వారా ముస్లింలకు ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉంటానన్న మాటను వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిలబెట్టుకున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేసినప్పటికీ, ఈ బిల్లుకు టీడీపీ నాయకులు అనుకూలంగా ఓటు వేశారని, పైగా వైఎస్సార్ సీపీపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై ఆందోళనలు చేస్తున్న ముస్లింలకు అండగా నిలబడిన వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లింల మనోభీష్టాన్ని గౌరవించి వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని ఆరిఫ్ డిమాండ్ చేశారు.

### డీఈడీ ఫీజు చెల్లింపునకు 23 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈడీ)కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 23తో ముగుస్తుందన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో 28వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.250, ప్రైవేటు విద్యార్థులు ఒక సబ్జెక్టుకు రూ.125, రెండు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.175, నాలుగు సబ్జెక్టులకు రూ.250 చొప్పున చెల్లించాలని వివరించారు.

# 'సీతమ్మను రాముడు ఎన్నడూ శంకించలేదు'



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'రామాయణాన్ని చదవని వారు, రామతత్వాన్ని అర్థం చేసుకోని వారు సీతమ్మను రాముడు పరిత్యజించడాన్ని విమర్శిస్తారు. రాముడు ఎన్నడూ సీతమ్మను శంకించలేదు' అని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఋషిపీఠం సత్సంగం ఆధ్వర్యాన ఉత్తరకాండపై నాలుగో రోజు ప్రవచనాన్ని స్థానిక టి.నగర్ హిందూ సమాజంలో శుక్రవారం ఆయన కొనసాగించారు. 'భర్తృ ధర్మం వేరు, రాజధర్మం వేరు. రాముడు రాజ ధర్మానికి కట్టుబడిన పాలకుడు. భద్రునితో తనను గురించి ప్రజలు మాట్లాడుకుంటున్న శుభాశుభాలు రెండూ తెలుసుకోవాలని రాముడు స్పష్టం చేశాడు. మన రాముడు సాగరంపై సేతువు నిర్మించి, రావణుని వధించి, దుష్కరమైన పని చేశాడు. కానీ, రావణుని స్పర్శ తగిలిన సీతమ్మను రాముడు ఎలా ఏలుకుంటున్నాడని ప్రజలు అనుకుంటున్నారని భద్రుడు చెబుతాడు. ఆదర్శవంతమైన పాలకుడు వ్యక్తిగత జీవితంలో కూడా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి' అని సామవేదం వివరించారు. 'ఒక వ్యక్తి కీర్తి ఎంత కాలం ఈ లోకంలో ఉంటుందో, అంత కాలం ఆ వ్యక్తి ఉన్నత లోకాల్లో ఉంటాడు. ప్రతి ఒక్కరూ అపకీర్తి సోకకుండా తమను తాము రక్షించుకోవాలి. లోకాపవాదు అత్యంత బాధాకరమైనది. కానీ లోకాపవాదాన్ని తొలగించుకోవాలి. రాముడు 11 వేల సంవత్సరాలు పరిపాలిస్తే, అప్పటికే 9 వేల సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పటి వారు సీతమ్మ అగ్నిప్రవేశాన్ని నమ్మకపోయి ఉండవచ్చు. అపవాదు పట్ల రాముడు ఎంతగానో దుఃఖించాడు. సీతాపరిత్యాగమే తన కర్తవ్యమన్న నిర్ణయానికి వచ్చాడు. ఎవరో ఒక అనామకుడు చెబితే సీతమ్మను ఆయన పరిత్యజించలేదు. ఈ సందర్భంగా మనకు లవకుశ సినిమా గుర్తు రావచ్చు. ఆ సినిమా ప్రారంభంలోనే పద్మ పురాణాంతర్గతమైన కథను అనుసరించి సినిమాను రూపొందించినట్లు పేర్కొన్నారు. వివిధ కల్పాల్లో రామాయణ గాథ జరిగింది. వైవస్వత మన్వంతరంలోని కథను వాల్మీకి మహర్షి మనకు ప్రసాదించారు. స్థూల ధర్మం వేరు, సూక్ష్మ ధర్మం వేరు' అని సామవేదం వివరించారు. రాముడు ఎన్నడూ ధర్మమార్గాన్ని వీడలేదని, ఆయన మూర్తీభవించిన ధర్మస్వరూపుడని చెప్పారు.

# ఫీల్డుకెళ్లం

- ఫీల్డ్ అసిస్టెంట్ల పోరుబాట
- అధికారులకు సమ్మె నోటీసు
- సమస్యలు పరిష్కరించకుంటే 21న పెన్‌డౌన్
- 28 నుంచి నిరవధిక సమ్మెకు నిర్ణయం



రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావుకు సమ్మె నోటీసు ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు అనేక అడ్డగోలు హామీలు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని నెరవేర్చకపోవడంతో వివిధ వర్గాలు ఆందోళన బాట పడుతున్నాయి. ఈ జాబితాలోకి తాజాగా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా వచ్చి చేరారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే విధులు బహిష్కరిస్తామని జిల్లావ్యాప్తంగా 300 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. ఆందోళనలో భాగంగా ఈ నెల 16 నుంచి వారు నిరసనలకు శ్రీకారం చుట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. తమ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరిస్తామంటూ ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి , పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పదవి చేపట్టినా తమను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ నెల 28వ తేదీలోగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే పూర్తి స్థాయిలో విధులు బహిష్కరించి, సమ్మె బాట పడతామని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు.

**ఇవీ డిమాండ్లు**

- 19 ఏళ్ల సర్వీసును గుర్తించి, ఫీల్డ్ అసిస్టెంట్లందరినీ గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించి, విధులు క్రమబద్ధీకరించాలి.
- అందరికీ ఎఫ్‌టీఈ ఇచ్చి, పూర్తి స్థాయి హెచ్ఆర్ పాలసీ, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా గ్రాట్యుటీ వంటివి అమలు చేయాలి.
- విధి నిర్వహణలో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలి. మరణ పరిహారంగా రూ.10 లక్షలు చెల్లించాలి.
- 2016–19 మధ్య ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న అన్ని కేటగిరీల ఉద్యోగులకు జీతాలు పెంచారు. కానీ ఫీల్డ్ అసిస్టెంట్లకు పెంచలేదు. అదే నిష్పత్తిలో జీతాలు పెంచాలి.
- విద్యార్హతల ఆధారంగా పదోన్నతులు ఇచ్చి, అర్హులైన వారిని కంప్యూటర్ ఆపరేటర్లుగా, టెక్నికల్ అసిస్టెంట్లుగా నియమించాలి.

**ఇదీ ఉద్యమ కార్యాచరణ**

ప్రస్తుతం నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరవుతున్నారు. అధికారులకు ఈ నెల 16న సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ నెల 21న ఒక రోజు పనులు పూర్తిగా నిలుపు చేసి, పెన్‌డౌన్ చేస్తారు. సమ్మె విషయం తెలియజేస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఈ నెల 28 నుంచి విధులు పూర్తిగా బహిష్కరించి నిరవధిక సమ్మె చేయాలని ఫీల్డు అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

### పరిష్కరించే వరకూ పోరాటం



దీర్ఘకాలంగా ఉన్న మా సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాడతాం. మాకు న్యాయం చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. కానీ నిరాశే మిగిలింది. అందుకే వేరే దారి లేక ఉద్యమానికి వెళ్తున్నాం. గడువులోగా మా డిమాండ్లు నెరవేర్చకపోతే నిరవధిక సమ్మె చేస్తాం.

– అలమండ రాజబాబు, జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు

### డిమాండ్లు నెరవేర్చాలి



న్యాయబద్ధంగా రావాల్సినవే మేము అడుగుతున్నాం. మా డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకుంటే సమ్మె తప్ప వేరే మార్గం లేదు. సమస్యలు పరిష్కరిస్తారని ఇప్పటి వరకూ వేచి చూశాం. కానీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– అంబటి శ్రీనుబాబు, జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం కార్యదర్శి

# నరకం వయా బరకం!

- ధాన్యపు రాశులపై కప్పుతున్న రైతులు
- నల్లవి కావడంతో రాత్రి సమయాల్లో ప్రయాణికులకు కనపడని పరిస్థితి
- ప్రాణాలు కోల్పోతున్న వాహన చోదకులు
- అన్నదాతకు అవగాహన కల్పించాలని పోలీసులను కోరుతున్న ప్రజలు



దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద రోడ్డులో ఆరబెట్టిన ధాన్యపు రాసులు



దేవరపల్లి మండలం దుద్దుకూరు-గౌరీపట్నం గ్రామాల మధ్య హైవే సర్వీసు రోడ్డులో వేసిన ధాన్యపు రాసులు

**దేవరపల్లి:** రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులు ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి. పగలంతా రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని రాత్రి సమయంలో అక్కడే రాశులుగా వేసి వాటిపై నల్లబరకాలు కప్పుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనచోదకులు ఆ రాశులను ఢీ కొని ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అనేక మంది ఇలా ప్రమాదాలపాలై తీవ్రగాయాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు మండలంలో ఈ విధమైన ప్రమాదాల్లో సుమారు 10 మంది గాయపడినట్టు సమాచారం. ఇటీవల గౌరీపట్నం వద్ద స్కూటీపై వెళుతున్న భార్యాభర్తలు ధాన్యం రాశులను ఢీ కొని తీవ్రంగా గాయపడ్డారు. కొవ్వూరు నుంచి గోపాలపురం వెళ్తున్న పోస్టల్ ఉద్యోగి దుద్దుకూరు వద్ద రాత్రి సమయంలో ధాన్యపురాశిని ఢీ కొని గాయపడ్డారు. ఈ విధంగా వెలుగుచూడని ప్రమాదాలు ఎన్నో జరుగుతున్నాయి. ధాన్యం రాశులపై నల్ల బరకాలు కప్పడం వల్ల రాత్రి సమయంలో ప్రయాణికులకు కనపడక వారు వాటిని ఢీకొని ప్రమాదాల పాలవుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యపు రాశుల చుట్టూ పెద్ద రాతి బండలను పెడుతున్నారు. వాటి వల్ల కూడా వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. రోడ్డుపై గల ధాన్యం రాశుల వద్ద కనీసం ఎటువంటి హెచ్చరిక బోర్డులు పెట్టక పోవడం బాధ్యతా రాహిత్యమే. ఇప్పటికైనా అధికారులు రోడ్లపై ఆరబెడుతున్న ధాన్యం రాశుల వద్ద సూచకలు ఏర్పాటు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, రోడ్డు మధ్యలో ధాన్యపు కుప్పలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు మండలాల్లోని రైతులు గుండుగొలను-కొవ్వూరు 16వ జాతీయరహదారి సర్వీసు రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి ఒబ్బిడి చేసుకుంటుంటారు. పొలాల్లో ధాన్యం ఆరబెట్టుకోవడానికి కళ్లాలు లేక రోడ్డుపైనే ధాన్యాన్ని ఆరబెడతారు. హైవేకు ఇరువైపుల గల సర్వీసు రోడ్లు ధాన్యంతో నిండి ఉంటున్నాయి. రాసులకు తెల్లబరకాలు కప్పి, రాళ్లు పెట్టకుండా సూచక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు అధికారులను కోరుతున్నారు. మండలంలోని కృష్ణంపాలెం వద్ద గురువారం రాత్రి ధాన్యపు రాశిని ఢీ కొని యువకుడు మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. రాత్రి సమయంలో సర్వీసు రోడ్డులో వెళ్లాలంటే ప్రజలు భయంతో వణికిపోతున్నారు.

**కనుమరుగైన వరికుప్పలు**

పొలాల్లో వేసే వరికుప్పలు కనుమరుగయ్యాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్వం పొలంలోనే కుప్పగా వేసి సీతాకాలంలో పంటకు గిట్టుబాటు ధర పలికినప్పుడు కుప్పలను మసూళ్లు చేసి విక్రయించేవారు. దాదాపు ఆరు నెలలు ధాన్యం కుప్పలో ఉండి ధాన్యం రుచికరంగా ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా పొలాల్లో కనుచూపు మేర వరికుప్పలు కనిపించేవి. పంటను కూలీలతో కోయించి పనలపై ఆరబెట్టి కుప్పలు వేసే వారు. సాంకేతిక వ్యవసాయ పద్ధతులు మారడం, యంత్రాలు అందుబాటులోకి రావడంతో యంత్రాలతో ధాన్యాన్ని కోసి ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే రోడ్లపై ఆరబెట్టి వ్యాపారులకు విక్రయించి రైతులు సొమ్ము చేసుకుంటున్నారు. ధాన్యం రైతులు రహదారులనే కళ్లాలుగా వినియోగించుకుంటున్నారు. పండించిన పంటలను ఆరబెట్టుకోవడానికి గ్రామాల్లో ప్రభుత్వం యార్డులు ఏర్పాటు చేసి బరకాలు రాయితీపై అందజేయాలని రైతులు కోరుతున్నారు.

### హైవే అధికారుల దృష్టికి తీసుకువెళతా



గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారి (16) సర్వీసు రోడ్లపై వేస్తున్న ధాన్యపు రాశులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి వల్ల రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. దేవరపల్లి మండలంలో సూర్యనారాయణపురం నుంచి గౌరీపట్నం వరకు హైవేకు ఇరువైపులా గల సర్వీసు రోడ్లపై రైతులు ధాన్యం రాసులు వేస్తున్నారు. రాసులపై నల్లబరకాలు కప్పడం వల్ల రాత్రి సమయంలో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. హైవే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాము. – వి.సుబ్రహమణ్యం, ఎస్సై, దేవరపల్లి

## ధాన్యపురాశిని ఢీకొని యువకుడి మృతి

- రాత్రి వేళ రాకపోకలు లేక ఎవరూ గుర్తించని పరిస్థితి
- తెల్లవారు జామున 3 గంటల వరకు రోడ్డుపైనే పడిఉన్న వైనం
- హైవే పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించి పోలీసుల సాయంతో ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారణ



కృష్ణంపాలెం వద్ద హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీరవెంకటరమణ

**దేవరపల్లి:** రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం రాసులను ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద జరిగింది. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం మండలంలోని కొత్తగూడేనికి చెందిన పుట్టా వీరవెంకటరమణ(30) గురువారం సాయంత్రం యర్నగూడెంలోని తన తండ్రి వద్దకు వెళ్లాడు. తండ్రితో మాట్లాడి అర్ధరాత్రి సమయంలో తిరిగి గుండుగొలను-కొవ్వూరు 16వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో బైక్‌పై వస్తుండగా, రోడ్డుపై ఆరబెట్టి ఉన్న ధాన్యం రాశులను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో వీర వెంకటరమణ రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయం తగిలింది. అయితే అర్ధ రాత్రి సమయం కావడం, ఆ సమయంలో అటు వైపు ఎవరూ వెళ్లకపోవడంతో రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న వీరవెంకటరమణను ఎవరూ చూడలేదు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో హైవే పెట్రోలింగ్ సిబ్బంది గమనించి స్థానిక పోలీసుల సహకారంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో ఉన్న వీరవెంకటరమణను గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. సత్యనారాయణ తల్లి ఏడాది క్రితం మృతి చెందగా, తండ్రి ఉన్నారు. తండ్రి యర్నగూడెంలో ఉంటుండగా, వెంకటరమణ కొత్తగూడెంలో ఉంటున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి. సుబ్రహ్మణ్యం తెలిపారు.

## క్లుప్తంగా

### స్వాధీనం చేసుకున్న ఆవులు గోశాలకు తరలింపు

**నల్లజర్ల:** ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, సమరసత ఫౌండేషన్ సభ్యులు గురువారం రాత్రి పట్టుకున్న గోవులను కోరుకొండ సమీపంలోని రామన్నపాలెం గోశాలకు అర్ధరాత్రి 3 గంటలకు తరలించారు. ఒడిశా రాష్ట్రం నవరంగ్ పూర్ నుంచి హనుమాన్ జంక్షన్ సంతకు కంటైనర్ లారీలో తరలిస్తున్న 85 గోవులను గురువారం రాత్రి పట్టుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం ఉత్తరాంధ్ర గోసంరణ కమిటీ అధ్యక్షుడు మెట్టపల్లి సుబ్బారావు గోశాలకు వెళ్లి వాటి బాగోగులను పరిశీలించారు. సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు, ఆర్ఎస్ఎస్ కార్యకర్త గుంటుముక్కల రామకృష్ణ, తాడేపల్లిగూడెం గోశాల అధ్యక్షులు మద్దూరి విష్ణుమూర్తి, సవలం రామకృష్ణ తదితరులు గోవులను అప్పగించిన వారిలో ఉన్నారు.

### రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం

**ఒక వ్యక్తికి తీవ్రగాయలు**

**జగ్గంపేట:** మండలంలోని ఒక రైసు మిల్లులో ఎలక్ట్రికల్ కెపాసిటర్ పేలి ఒక వ్యక్తి కళ్లు దెబ్బతిని, ముఖం కాలిపోయినట్లు తెలుస్తోంది. అయితే గాయపడిన వ్యక్తిని మిల్లు యాజమాన్యం వేరే ప్రాంతంలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా తమ రైసు మిల్లులో ఎలాంటి ప్రమాదం జరగలేదని యాజమాన్యం చెప్పినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. ఈ సంఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని అన్నారు. బాధితుడు విజయవాడ నుంచి వచ్చి సదరు రైసు మిల్లులో విద్యుత్ సంబంధ పనులు చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు చెపుతున్నారు.

# నైవేద్య నారాయణులు

- ప్రభుత్వ వైద్యానికి వస్తే ప్రైవేటు ఆస్పత్రులకు సిఫారసు
- అక్కడ అన్నీ తామై రోగులకు చికిత్స
- శస్త్ర చికిత్స వికటించి రోగి మృతితో బండారం బట్టబయలు
- విచారణ చేస్తున్న ఉన్నతాధికారులు



రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర వైద్యశాల

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** పేదవాడికి సుస్తీ చేస్తే వచ్చే మొదటి ఆలోచన ప్రభుత్వ వైద్యం. పూర్తిగా నయం కాకపోయినా తత్కాంతి జరుగుతుందనే ఆశ. అక్కడ కూడా వారికి టేక్ డైవర్షన్ అంటూ ప్రైవేటు వైద్యానికి దారిచూపే పరిస్థితి ఎదురైతే వారిని ఆదుకునేదెవరు? ఆ దారిచూపేది కూడా అక్కడి వైద్యుడే అయితే? ప్రసాదాలు ప్రభుత్వాస్పత్రికి.. గిన్నిలో వండిన మొత్తం నైవేద్యం తన జేబులోకి అన్నట్టుంది రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో పరిస్థితి. ఈ ఆస్పత్రిలో అందేది అరకొర వైద్యమేనన్నది బహిరంగ రహస్యం. ఆర్థికంగా ఓ మోస్తరుగా తట్టుకోగలరన్న రోగులను గుర్తించి ఈ ఆస్పత్రిలో వసతుల లేమిని బూచిగా చూపి ప్రైవేటు వైద్యానికి సిఫారసు చేస్తూ ఫలానా ఆస్పత్రికి వెళ్లండి.. అక్కడ వసతులు బాగుంటాయి.. అక్కడికి నేనే వచ్చి వైద్యం చేస్తానని పంపుతూ నిలువునా వారిని దోచుకుంటున్నారు. పేదలకు వైద్యం చేసేందుకు ప్రభుత్వం నుంచి లక్షలాది రూపాయల జీతాలు తీసుకుంటూ పేదల జేబులు గుల్ల చేస్తున్న ఇటువంటి వారిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**అతిథిగా ఇక్కడ.. అతిగా అక్కడ..**

రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వైద్యులు సమయపాలనకు బహుదూరం. ఇక్కడికి అతిథిలా వచ్చి ఏవో తోచినన్ని కేసులు చూసి, ప్రైవేటు కన్సల్టెంట్లుగా అత్యధిక సమయాన్ని కేటాయిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇక్కడ ఉన్న కొద్ది సేపటిలోనే రోగుల స్థితిగతులు గుర్తించడం లేనిపోని అనారోగ్య సమస్యలు చెప్పి వారిని భయపెట్టి ఇక్కడ వసతులు లేవు ఫలానా ఆస్పత్రికి వెళ్లండని చెప్పడం. అక్కడ ఈ వైద్యుడే వారికి వైద్యం చకచకా కార్యాచరణలోకి దిగిపోతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో తీయించిన రిపోర్టులతోనే వారు అనుకున్న మొత్తానికి వైద్యం, బిల్లు చేయించి సదరు ప్రైవేటు యాజమాన్యంతో భాగస్వామ్య పంపకాలు జరిగిపోతున్నాయి.

**ఉచిత సలహాలు ఇక్కడ.. ఖరీదైన మందులు అక్కడ..**

ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూరో, ఆర్థో, ట్రామా తదితర విభాగాల్లో రోజుల తరబడి చికిత్స పొందుతున్న రోగులకు ఆయా విభాగాల్లోని కొందరు వైద్యులు మెరుగైన ఫలితాలకు మంచి మందులు వాడాలని రోగికి, బంధువులకు ఉచిత సలహాలిస్తుంటారు. అసలే రోగభయంతో ఉన్న రోగులు, వారి బంధువులు వాటి గురించి ప్రశ్నిస్తారు. వెంటనే సదరు వైద్యుడు ఆ మందుల ఏజెంట్ తనకు తెలుసునని, తక్కువకు ఇప్పిస్తానని నమ్మబలికి వెంటనే సదరు ఏజెంటును పిలిపించి వారికి కావలసిన మందులు ఇప్పించి కమీషన్లతో జేబులు నింపుకొంటున్నారు. మరి కొందరు వైద్యులు తమతో ఆర్థిక లావాదేవీలున్న కొన్ని మందుల దుకాణాల్లో లభించే మందులనే రోగులకు రాసి, ఫలానా దుకాణంలో మాత్రమే కొనుగోలు చేయండని చెప్పి తద్వారా 20 శాతం కమీషన్ పొందుతున్నారు.

**వైద్యం వికటించి బయటపడిన భాగోతం**

సాధారణంగా ప్రభుత్వాసుపత్రి వైద్యులు చేస్తున్న నిర్వాకాలపై రోగుల నుంచి ఫిర్యాదులు అందడం తక్కువ. తమ ప్రాణానికి ఏమౌతుందో అన్న ఆందోళన, వైద్యులపై ఫిర్యాదు చేస్తే వైద్యం సరిగ్గా చేయరన్న భయంతో రోగులు ఫిర్యాదులకు వెనకడుగు వేస్తారు. ఈ నెల ఏడో తేదీన ఆలమూరుకు చెందిన గుమ్మిశెట్టి సత్యనారాయణ ట్రాక్టర్ నుంచి పడి కాళ్లు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఈ ఆసుపత్రిలో వైద్యుడు సూర్యతేజ అతనికి వైద్యం మొదలుపెట్టి ఇక్కడ ఉంటే సమస్య పరిష్కారం కాదని, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే అక్కడ తాను వచ్చి సర్జరీ చేస్తానని సూచించారని అతడి బంధువు చెప్పారు. తన మంచికేనని నమ్మిన వెళ్లిన సత్యనారాయణకు దానవాయిపేటలోని హెలియోస్ ఆసుపత్రిలో సూర్యతేజ శస్త్ర చికిత్స చేశారు. శస్త్రచికిత్స విజయవంతమైందని, అబ్జర్వేషన్‌లో పెట్టామని, ఉదయానికి మెలకువ వస్తుందని అపుడు ఏమైనా పెట్టండని చెప్పి వెళ్లిపోయారు. మర్నాడు ఉదయం రోగి వద్దకు కుటుంబ సభ్యులు వెళ్లగా చలనం లేని స్థితిలో శరీరం పూర్తిగా చల్లబడి ఉంది. ఆస్పత్రి వర్గాలు వచ్చి చూసేసరికి అతడు మృతిచెంది ఉన్నాడు. వైద్యం వికటించడం వల్లే రోగి మృతి చెందాడని బంధువులు ఆందోళన చేశారు. ఈ విషయం రాద్ధాంతమయ్యే సరికి వేళ్లన్నీ సూర్యతేజవైపు చూపాయి. దీంతో ఆయన నిర్వాకం బయటపడడంతో ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు.

**ప్రభుత్వాస్పత్రిపై పర్యవేక్షణ అవసరం**

రాజమహేంద్రవరం సమగ్ర ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సమయం వెచ్చించేలా పర్యవేక్షణ జరగాలి. కొందరు వైద్యులు, సిబ్బంది బయోమెట్రిక్ పెట్టి హాజరవుతున్నా ఆ తర్వాత బయట ఆసుపత్రుల్లో అటెండ్ అవుతున్నారు. ఒక వేళ ఎవరైనా సదరు వైద్యుడి కోసం ఆరా తీసినా రౌండ్స్‌లో ఉన్నట్టు చెప్తున్నారు. ఇటువంటి వాటిపై నిఘా పెట్టాలి.

### గుండెపోటుతోనే మరణం

ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం, శస్త్రచికిత్స చేసింది నేనే. అయితే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన అతడిని ప్రైవేటు ఆస్పత్రికి రిఫర్ చేయలేదు. వాళ్లే వెళ్లారు. అతడికి శస్త్రచికిత్స విజయవంతంగానే జరిగింది. అతను గుండెపోటుతో మరణించాడు. తన వైద్యం వికటించి కాదు.

– డాక్టర్ సూర్యతేజ

### మేం చెప్పేవరకూ పట్టించుకోలేదు



మా మావయ్యకు ప్రమాదం జరిగి ప్రభుత్వాసుపత్రికి వెళ్తే అక్కడ వైద్యుడు దానవాయిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురమ్మని చెప్పారు. దీంతో సూర్యతేజ చెప్పినట్టుగానే తీసుకెళ్లాం. ఆపరేషన్ చేశాం, సక్సెస్ అన్నారు. తర్వాత నుంచి మనిషిని చూడలేదు. మర్నాడు ఉదయం ఐసీయూలోకి వెళ్లి చూస్తే శరీరం చల్లబడిపోయి ఉంది. వెంటనే భయంతో బయటకు వచ్చి అరిచాం. దీంతో అక్కడ ఉన్న నర్సులు వచ్చి చూశారు. అప్పటికే మా మావయ్య చనిపోయాడు.

– మృతుని కోడలు గుమ్మిశెట్టి వీర

### అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 14,000 – 14,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 9,500 – 10,000 |
| **కురిడీ కొబ్బరి (పాతవి)** | |
| గండేరా (వెయ్యి) | 19,000 |
| గటగట (వెయ్యి) | 17,000 |
| **కురిడీ కొబ్బరి (కొత్తవి)** | |
| గండేరా (వెయ్యి) | 18,000 |
| గటగట (వెయ్యి) | 16,000 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 13,000 – 13,500 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 13,000 – 13,500 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |

### వాహనం ఢీకొని వ్యక్తి మృతి



బూల వెంకటరత్నం (ఫైల్)

**మామిడికుదురు:** స్థానిక 216వ నంబర్ జాతీయ రహదారిపై గో ఫ్రెష్ ఎదురుగా వాహనం ఢీ కొని పెదపట్నం లంక గెడ్డంవారిపేటకు చెందిన బూల వెంకటరత్నం (34) శుక్రవారం మృతి చెందాడు. విద్యుత్ సామాన్ల కోసం హోండా యాక్టివ్‌పై మామిడికుదురు వచ్చి ప్రమాదానికి గురయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. హైదారాబాదులోని సీఎంఆర్‌లో పని చేస్తున్న వెంకటరత్నం మూడు రోజులు సెలవులు రావడంతో శుక్రవారం ఉదయం స్వగ్రామం వచ్చి మృత్యువుపాలయ్యాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఏడేళ్ల క్రితం లక్ష్మీదుర్గతో అతడికి వివాహమైంది. అతనికి ఆరేళ్ల భరత్ శ్రీసాయి, రెండేళ్ల మాధురి లక్ష్మి సంతానం. వెంకటరత్నం మృతితో తాము జీవనాధారం కోల్పోయామని, ఇక తమకు దిక్కెవరంటూ అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు. ఎస్సై చైతన్యకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రీ స్ట్రక్చర్ లెక్క తేలేనా?

- అధికారుల ఆదేశాలతో ఎంఈఓలు బిజీ
- వేకెన్సీ పొజిషన్, క్యాడర్ స్ట్రెంగ్త్‌పై కసరత్తు



క్యాడర్ స్ట్రెంత్, వేకెన్సీ పొజిషన్ లెక్క తేల్చే పనిలో నిమగ్నమైన ఎంఈవోలు, సాంకేతిక సిబ్బంది

**రాయవరం:** ఎంకి పెళ్లి సుబ్బిచావుకు వచ్చిందన్నట్లుగా ఉంది విద్యాశాఖ పరిస్థితి. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన 117 జీవో ప్రకారం 3, 4, 5 తరగతులను అవకాశం ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లను ఇవ్వాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ఆ జీఓ తీసుకు వచ్చింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ జీవోకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆయా తరగతులను తిరిగి పూర్వపు పాఠశాలలకు పంపించేందుకు రీ స్ట్రక్చర్ పేరుతో కసరత్తు చేస్తోంది. ఈ ప్రక్రియ ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టు తయారైంది. ఇందులో భాగంగా పాఠశాలలను మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, ఫౌండేషన్ పాఠశాలలుగా విభజించారు. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీనికి విద్యార్థులు కనీసం 60 మంది ఉండాలని నిర్ధారించారు. ఏదైనా గ్రామంలో మోడల్ స్కూల్ లేకుంటే కనీస రోల్ 45గా పరిగణించాలని సూచించారు. దీనికి ఎస్ఎంసీల తీర్మానాలు ఉండాలని ముడిపెట్టడంతో ప్రతి గ్రామంలో ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చిన పాఠశాలల ఎస్ఎంసీల నుంచి వ్యతిరేకత వచ్చింది. అలాగే రీ స్ట్రక్చర్ ప్రాతిపదికన 1, 2 తరగతులున్న ఫౌండేషన్ స్కూళ్లలో 1:30 నిష్పత్తి, బేసిక్ ప్రైమరీలో 1:20, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో కనీసం ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారు. ఉన్నత పాఠశాలల్లో సెక్షన్లను పరిగణలోనికి తీసుకుని, ఉపాధ్యాయుల సంఖ్యను నిర్ధారించారు. ఈ నిష్పత్తి ప్రకారం ఎంఈఓలు క్యాడర్ స్ట్రెంగ్త్‌ను, అదే సమయంలో వేకెన్సీ పొజిషన్‌ను లెక్క తేల్చే పనిలో పడ్డారు.

**ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన**

జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, రేషనలైజేషన్ తదితర అంశాలను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగానే చేపడుతున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న క్యాడర్‌స్ట్రెంగ్త్, క్యాడర్ వారీగా ఖాళీల సంఖ్యను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా కాకినాడ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు కుస్తీ పడుతున్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సెలవు అయినప్పటికీ లెక్క తేల్చాలని అధికారులు ఆదేశించడంతో శనివారం నాటికి వాటిని సిద్ధం చేసేలా ఎంఈవోలు, సాంకేతిక సిబ్బంది కుస్తీ పడుతున్నారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేపూడి మృతి



**కాకినాడ సిటీ:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొండేపూడి శ్యాంబాబు మాదిగ శుక్రవారం మరణించారు. 1994లో సమితి ఏర్పడిన తర్వాత 1995లో మందకృష్ణమాదిగ తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో కొండేపూడిని జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. అప్పటి నుంచి 30 ఏళ్ల పాటు ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని అనేకసార్లు జైలు జీవితాన్ని గడిపారు. కలెక్టరేట్ దగ్గర జరిగిన విధ్వంసం కేసులో 40 రోజులపాటు జైల్లో ఉన్నారు. తాళ్లరేవు తాహసీల్దార్ కార్యాలయం దహనం, రైల్‌రోకో సందర్భంగా గొల్లప్రోలులో రైళ్ల రాకపోకలను అడ్డగించిన కేసుల్లో నెలలు తరబడి జైల్లో ఉన్నారు. జిల్లాలోని మాదిగ సంఘాల నాయకులు శ్యాంబాబుకు నివాళులర్పించారు.